ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

అమరాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి వాటి ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన మెగా ఉద్యోగ మేళా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉద్యోగ మేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 98 మంది హాజరుకాగా 45 మంది ఎంపికయ్యారు. వారికి తిప్పేస్వామి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, జిల్లా ఉపాధికల్పనా అధికారిణి కల్యాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, జిల్లా రూడ్‌సెట్ డైరెక్టర్ శాంతిప్రియ, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో రామారావు, మండల తెదేపా కన్వీనర్ కృష్ణమూర్తితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు హైటెక్ హంగులు

అందుబాటులోకి వచ్చిన కొత్త ముఖద్వారం

ప్రయాణికులకు ఆధునిక వసతులు

అనంతపురం (మూడో రోడ్డు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ హైటెక్ హంగులు సంతరించుకుంది. ప్రయాణికులకు ఆధునిక వసతులు అందుబాటులోకి తెస్తున్నారు. అమృత్ నిధులు రూ.9 కోట్లతో తొలివిడత పనులు పూర్తిచేశారు. శ్రీనివాసనగర్ వైపు కొత్త ముఖద్వారం నిర్మించారు. రెండో విడత కింద రూ.25 కోట్లతో స్టేషన్ లోపల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను చేపట్టనున్నారు. అనంత స్టేషన్ మీదుగా రోజూ పదివేలకుపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సగటున 42 ఎక్స్‌ప్రెస్, 8 ప్యాసింజర్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. అదనంగా వారాంతపు రైళ్లున్నాయి.

గదులు.. ఎస్కలేటర్లు.. లిఫ్టులు

ప్రయాణికులు వేచి ఉండటానికి సౌకర్యవంతమైన గదులు, అధునాతన ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాట్‌ఫారాలు దాటేందుకు లిఫ్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు 12 మీటర్ల వెడల్పుతో మరో వంతెన నిర్మిస్తున్నారు. దీనికి అనుసంధానంగా ఎస్కలేటర్లు వస్తాయి. ప్రయాణికులు సులభంగా ప్లాట్‌ఫారం మారడానికి ఇవి అనుకూలంగా ఉంటాయి. రెండు వైపులా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఉంటాయి. ఒకదానికి ఇప్పటికే లిఫ్ట్ ఉన్న విషయం తెలిసిందే. చిన్నపిల్లల తల్లులు పాలు ఇవ్వడానికి ప్రత్యేక గదులను అందుబాటులోకి తేనున్నారు. శ్రీనివాసనగర్ వైపు అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులకు అవసరమైన గదులు ఏర్పాటు చేస్తున్నారు.

ఐదుగురు గ్రేడ్-2 కార్యదర్శులకు పదోన్నతి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1గా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం రాత్రి డీపీఓ నాగరాజు నాయుడు ఉత్తర్వులను కార్యదర్శులకు అందజేశారు. పి.సర్దార్‌వలిని ఎ.నారాయణపురం, ఎన్.నరేంద్రబాబును రాచానపల్లి, ఎంవీవీ ప్రసాద్‌గౌడును రాప్తాడుకు, షామీర్‌ను ఉరవకొండ పంచాయతీ, ఎ.మహబూబ్‌బాషను కొనకొండ్ల పంచాయతీలకు బదిలీ చేశారు.

99.78 శాతం మందికి పోలియో చుక్కలు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంత జిల్లాలో మంగళవారం నాటికి 99.78శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. 28న చుక్కల మందు వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేశారని చెప్పారు. 0-5 ఏళ్లలోపు పిల్లలు 2,67,736 మంది ఉండగా 2,67,169 మందికి మందు వేశామని ఆమె వివరించారు.

పౌరసరఫరాల ఇన్‌ఛార్జి జిల్లాధికారిగా రమేశ్‌రెడ్డి

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డికి ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు మంగళవారం ఆ శాఖ కమిషనర్ కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 7వ తేదీ తర్వాత కొత్త డీఎస్‌వో జిల్లాకు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

శ్రీసత్యసాయి జిల్లాకు డీఏవోగా కృష్ణయ్య

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయాధికారి నారాయణనాయక్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో హిందూపురం డివిజన్ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా పనిచేస్తున్న కృష్ణయ్యకు ఇన్‌ఛార్జి డీఏవోగా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఆ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల ముందు కృష్ణయ్య ఇన్‌ఛార్జి డీఏవోగా పని చేసిన విషయం తెలిసిందే. కొత్త డీఏవో వచ్చే వరకు కృష్ణయ్య ఇన్‌ఛార్జిగా కొనసాగుతారని ఆ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా ఆహార భద్రత శాఖ ఏఎఫ్‌సీగా రామచందర్

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా ఆహార భద్రత శాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలరుగా కడప జిల్లా ఏఎఫ్‌సీ రామచందర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ ఏఎఫ్‌సీగా ఉన్న దేవరాజు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు.

నేడు డా.బి.సి.రాయ్ విగ్రహావిష్కరణ

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ విగ్రహాన్ని బుధవారం ఉదయం 10.20 నిమిషాలకు ఆవిష్కరించనున్నారు. ఈమేరకు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3లక్షల వ్యయంతో బీసీ రాయ్ విగ్రహాన్ని విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ అక్బర్‌సాబ్ స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్నట్లు అందులో ఆమె పేర్కొన్నారు.

ఉద్యాన హబ్‌తో రైతులకు ప్రోత్సాహం

జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, చల్లా రాజేంద్ర ప్రసాద్, పీఏవో వెంకటేశ్వర్లు, డీడీహెచ్ ఉమాదేవి తదితరులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తులు, ఎగుమతులతో పాటు ఆధునిక పద్ధతులతో అభివృద్ధి చేయడమే ఉద్యాన హబ్ లక్ష్యమని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర ఉద్యాన శాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, కాంటినెంటల్ కాఫీ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో 'ఉద్యాన పంటలు-ఫుడ్ ప్రాసెసింగ్-అవకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరై మాట్లాడారు. రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి కర్షకులను ప్రోత్సహించాలనే ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు తమవంతు కృషి చేస్తామన్నారు. మార్కెటింగ్, గిట్టుబాటు ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తెస్తామన్నారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ కార్యనిర్వాహక అధికారి చల్లా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులకు ఎప్పటికీ గిరాకీ ఉంటుందన్నారు. ఏపీఎంఏపీ ప్రాజెక్టు ఆఫీసరు వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ ఏడీ హరినాథరెడ్డి మాట్లాడుతూ యాపిల్, అవకాడ వంటి పంటలు సాగు చేయవద్దన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీ రఘునాథరెడ్డి, డీడీహెచ్ ఉమాదేవి, వ్యవసాయ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

పంపనూరు ఆలయ అభివృద్ధి అందరి బాధ్యత

◆ ఎమ్మెల్యే సునీత విరాళం రూ.1,11,116 ◆ తొలిరోజే రూ.11 లక్షలకుపైగా వసూలు

విరాళాన్ని ఫోన్‌పే చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం ఆలయంలో విరాళాల సేకరణను ప్రారంభించి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆలయాన్ని పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కారు వచ్చిన వెంటనే రూ.14.20 కోట్ల నిధులతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించిందన్నారు. తొలి విడతలో రూ.6.70 కోట్లతో చేపట్టనున్న పనులు త్వరలో మొదలవుతాయని, మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.1.34కోట్లు సేకరించాలన్నారు. ఇందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. భక్తులు నేరుగా విరాళాలు ఇవ్వొచ్చన్నారు. తనవంతుగా రూ.1,11,116లు ఫోన్‌పే చేశారు. ఆమె స్ఫూర్తితో భక్తులు రూ.10లక్షలకు పైగా విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కొత్త పీడీగా షాజిదాబేగం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) కొత్త పీడీగా ఎస్.షాజిదా బేగం నియమితులయ్యారు. మంగళవారం ఆ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఈమేరకు జీవో 108 జారీ చేశారు. ప్రస్తుత పీడీ శశికళ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలోకి పదోన్నతి ద్వారా షాజిదాబేగం రానున్నారు. ఈమె ప్రస్తుతం తాడిపత్రి ప్రాజెక్టు సీడీపీఓగా పనిచేస్తున్నారు. బుధ లేదా గురువారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. మరోవైపు శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సీడీపీఓ ఎం.నాగమల్లీశ్వరికి పదోన్నతి కల్పించి పల్నాడు జిల్లా పీడీగా నియమించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీడీ శశికళను ఘనంగా సత్కరించారు.

ఎస్కేయూ-ఏఐసీబోర్డు సభ్యురాలిగా ఆచార్య అనిత

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం (ఎస్కేయూ-ఏఐసీ) బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఆచార్య అనిత నియమితులయ్యారు. ఎంబీఏ విభాగం ఆచార్యురాలిగా, ఎస్కేయూ రెక్టార్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ సహకారంతో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం కార్యకలాపాలు సాగుతున్న విషయం తెలిసిందే. బోధన, పరిశోధన, పరిపాలన, సంస్థాగత అభివృద్ధి తదితర రంగాల్లో ఆమెకున్న విశేష అనుభవం ఇంక్యుబేషన్ కేంద్రం నిర్వహణకు తోడ్పడనుంది. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ విద్యార్థుల్లో పారిశ్రామిక దృక్పథం, స్టార్టప్ సంస్కృతి, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు.

భాజపా జిల్లా ఇన్‌ఛార్జుల నియామకం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌ఛార్జులను నియమిస్తూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన ఎస్.శ్రీనివాసులను కర్నూలుకు, అనంతపురం ఇన్‌ఛార్జిగా బి.చంద్రప్ప, శ్రీసత్యసాయి జిల్లాకు కె.నీలకంఠను నియమించారు. తక్షణమే వీరు బాధ్యతలు చేపట్టి ఆయా జిల్లాల్లో పర్యటించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ఫోన్ : 79016 26759 & 99015 74353

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 20.07.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 20.07.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 18.07.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీత(లు): M/s ఇండస్ జీన్ ఎక్స్‌ప్రెషన్స్ లిమిటెడ్ మరియు హామీదారులు/డైరెక్టర్లు: (శ్రీ. చన్నా సి రెడ్డి, తండ్రి: సి వెంకటరామి రెడ్డి, (శ్రీమతి ఉషారాణి సి రెడ్డి, భర్త: చన్నా సి రెడ్డి, (శ్రీ. బీదుపల్లి మల్లిఖార్జున రెడ్డి, తండ్రి: బి. నాగిరెడ్డి, శ్రీ. ఎన్. హిమదీప్, తండ్రి: వెంకటరమణా రెడ్డి, (శ్రీ. ఎ. శ్రీనివాస రెడ్డి, తండ్రి: ఎ. రవిచంద్రారెడ్డి మరియు (శ్రీమతి నల్లారి రూపనా రెడ్డి, భర్త: నల్లారి నిరూప్ కుమార్ రెడ్డి.

బకాయి మొత్తం: తేది 31.05.2026 నాటికి రూ. 26,94,63,997.85/- + తేది 01.06.2026 నుండి వర్తించు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
(శ్రీ సత్యసాయి జిల్లా, చిలమత్తూరు మండలం, కోదూరు గ్రామం, ఎన్.హెచ్-44 (హైదరాబాద్-బెంగళూరు రోడ్డు) ఉత్తర భాగం, సర్వే నెం: 178-3 (భాగం), 178-4, 178-5, 178-7, 178-8, 178-9 & 178-10 (భాగం) నందు ఎ. 14.89 సెంట్లలో ఇండస్ట్రియల్ భూమి (SEZ) మరియు 12158.04 చ॥అ॥ల విస్తీర్ణంలో గెస్ట్ హౌస్ బిల్డింగ్ (జిఎఫ్+ఎఫ్‌ఎఫ్). **హద్దులు: ఉత్తరం:** సెట్టిపల్లి ఫీల్డ్స్ సర్వే నెం.70, కోదూరు ఫీల్డ్స్ సర్వే నెం.178-3 (భాగం) & 178-2 భూమి, **దక్షిణం:** ఎన్‌హెచ్ 44 రోడ్, **తూర్పు:** కోదూరు ఫీల్డ్స్ సర్వే నెం.179 & 183 భూమి, **పడమర:** కోదూరు ఫీల్డ్స్ సర్వే నెం. 178-3 (భాగం), 178-2, 178-1, 178-6 & 157.

రిజర్వు ధర: రూ. 31,55,00,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 3,15,50,000/-

ఈ ఆస్తి SEZలో భాగంగా ఉంది. వర్తించే అన్ని నియమాలు, నిబంధనలు, షరతులు మరియు చట్టబద్ధమైనవి అన్ని ఈ అమ్మకానికి వర్తిస్తాయి. వివరాల కోసం దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి. పార్టీ దాఖలు చేసిన SA నెం. 71/2025 DRT-II హైదరాబాద్ నందు పెండింగ్‌లో ఉంది.

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన నవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.
* బిడ్డర్లు తమ ఆఫర్‌లను ఆస్తి రిజర్వు ధర ఉన్నవాటికి రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 29.06.2026, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దేశం, విదేశాల్లోని వివిధ ప్రాంతాలు సందర్శించే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ హైదరాబాద్ కేంద్రంగా దేశీయ, అంతర్జాతీయ ప్రత్యేక విమాన ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ విజయవాడ అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక, ప్రకృతి, సాహస యాత్రలు కోరుకునే పర్యాటకుల కోసం జులై నుంచి అక్టోబరు వరకు మొత్తం 13 ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. గంగా, గయా సంగమ యాత్ర (జులై 22) టికెట్ ధర ఒక్కొక్కరికీ రూ.38,850, కేరళ మాన్సూన్ మ్యాజిక్ యాత్ర (ఆగస్టు 3) రూ.41 వేలు, సౌత్ ఇండియా టెంపుల్ రన్ (ఆగస్టు 16) రూ.37,700, మధ్యప్రదేశ్ మహాదర్శన్ (ఆగస్టు 26) రూ.30,350, గోవా డిలైట్ (ఆగస్టు 26) రూ.21 వేలు, ఓరియంటల్ ఒడిశా (సెప్టెంబరు 26) రూ.30,700, చార్‌ధామ్ యాత్ర (సెప్టెంబరు 27) రూ.65,830, పవర్స్ ఆఫ్ సహ్యాద్రి (సెప్టెంబరు 27) రూ.36,600, అరుణోదయ అరుణాచల్ (అక్టోబరు 2) రూ.53,500, రాయల్ నేపాల్ (జులై 24) రూ.57,500, మలేషియా, సింగపూర్ (ఆగస్టు 14) రూ.1,48,500, శ్రీలంక రామాయణ యాత్ర (సెప్టెంబరు 24) రూ.69,100. టికెట్ల బుకింగ్ ఇతర వివరాల కోసం ఫోన్ నంబరు 92810 30714లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

రోటరీక్లబ్-3160 గవర్నర్‌గా కేశవరెడ్డి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రోటరీక్లబ్-3160 జిల్లా గవర్నర్‌గా అనంత నగరానికి చెందిన పి. కేశవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల ఒకటి నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. క్లబ్‌ల పనితీరు పరిశీలన, వివిధ రకాల ప్రాజెక్టు పనులకు ప్రతిపాదనలు, సభ్యుల సంఖ్య పెంపు, ప్రాధాన్యపరంగా సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తారు. రాయలసీమ పరిధిలోని అనంతపురం, కర్నూలు, నెల్లూరు, కడప ఉమ్మడి జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ, దావణగేరి, హోస్పేట్ తదితర ప్రాంతాలను కలిపి రోటరీక్లబ్-3160 జిల్లాగా పిలుస్తారు. బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పోలియో నిర్మూలనలో రోటరీక్లబ్ పాత్ర శ్లాఘనీయం. పేదలకు స్వయంఉపాధి, అక్షరాస్యత, మహిళా సాధికారతకు విశేష కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

మెరిట్ జాబితాపై అభ్యంతరాలకు గడువు పెంపు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ప్రత్యేక ఉద్యోగాల నియామకాల తాత్కాలిక మెరిట్ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను 7 వరకు ఇవ్వొచ్చని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు అర్చన తెలిపారు. జూన్ 30 వరకున్న గడువును పొడిగించామన్నారు. అభ్యంతరాలను కలెక్టరు కార్యాలయంలోని రికార్డు రూమ్‌లో అందజేయాలని ఆమె కోరారు.

సరకుల పంపిణీలో సమస్యలపై ఫోన్ చేయండి

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో నేటి నుంచి నుంచి చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరకుల పంపిణీ ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ తూకాలు, సకాలంలో దుకాణాలు తెరవక పోవడం, ఇతర సమస్యలపై కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని ఫోన్ నంబర్ 8500292992కు సమాచారం ఇవ్వాలని జేసీ విష్ణుచరణ్ కార్డుదారులకు సూచించారు. 1 నుంచి 15 వరకు దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. బియ్యం బదులు రాగులు, జొన్నలు మూడు కిలోల వరకు కార్డుదారులు పొందవచ్చని ఆయన వివరించారు.

జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జన్ సేవలు

అనంతపురం (వైద్యం),న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారంలో సోమవారం, మంగళవారం, బుధవారం రోజుల్లో ప్లాస్టిక్ సర్జన్ అందుబాటులో ఉంటారని సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు. సుదీర్ఘకాలం సర్వజన వైద్యశాలలో ప్లాస్టిక్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన స్పందించి కర్నూలు వైద్యశాలలో పనిచేస్తున్న ప్లాస్టిక్ సర్జన్లను రొటేషన్ పద్ధతిలో సర్వజన వైద్యశాలలో 3 రోజుల పాటు పనిచేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్లాస్టిక్ సర్జన్ అందుబాటులో ఉండే రోజుల్లో ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందాలని కోరారు.

నేడు పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారులతో వీసీ

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనునట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, లోఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్, సోలార్ మీటరింగ్, ఓపెన్ యాక్సెస్‌తోపాటు భద్రతా అంశాలకు సంబంధించిన సమస్యలను పారిశ్రామిక వినియోగదారులతో చర్చించేందుకు వీలుగా ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన లింక్ పంపుతామన్నారు.

EENADU Classifieds

JOBS

Wanted Telecallers and Counsellors Loc: ATP, Qul: Any Degree, Sal: 10K-15K + Incentives, Only Females. Ph: 6303220866, 9019377692.

అనంతపురం సంగమేశ్వర సర్కిల్‌లో టీ షాప్‌లో పనిచేయుటకు టీ మాస్టర్ కావలెను. డైలీ పేమెంట్, కాంటాక్ట్: 9393775476

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K to 20K. ✆ 96404 00073, 98485 71888

అభయ హాస్పిటల్ కొరకు ANM, GNM, B.Sc Nursing రిసెప్సనిస్ట్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ మరియు ఆయాలు, వార్డ